# ఉద్యమాలపై దుర్బుద్ధితో చేసే దుష్ప్రచారాన్ని ఆపండి !

# ఝరికోన ఉద్యమాన్ని సహృదయంతో స్వీకరించండి !!

ఝరికోన ప్రాజెక్ట్ నమూనా మార్చాలన్న డిమాండుతో మార్చి - ఏప్రిల్ నెలలలో జరిగిన ప్రజాందోళనలో మానవ హక్కుల వేదిక చురుకుగా పాల్గొనింది. ఆందోళన నడిపిన బాహుదా జల సంరక్షణ మరియు జల సాధన సమితికి కన్వీనర్‌గా మానవ హక్కుల వేదిక జిల్లా కమిటి సభ్యుడు బాధ్యత తీసుకున్నాడు. సుండుపల్లి మండల వాసుల డిమాండ్ మేరకు ప్రాజెక్ట్ రూపకల్పనలో మార్పు చేయబడుతుందని ఎం.పి. సాయి ప్రతాప్ గారు ఇచ్చిన హామీ మేరకు ఆందోళనను నిలిపి వేయడం జరిగింది. అయితే ఆ హామీ అమలు కాని పక్షంలో ఆందోళన తిరిగి ప్రారంభించడానికి ఆందోళన కారులు సిద్దంగా ఉన్నారు. మానవ హక్కుల వేదిక కూడ తన పాత్ర నిర్వహిస్తుంది.

ఆ ఆందోళన గురించి అనేక అపోహలు ప్రచారమయిన కారణంగా దాని లక్ష్యమేమిటో అందులో మానవ హక్కుల వేదిక ఎందుకు చొరవ తీసుకున్నదో వివరించడం అవసరం అని మేము బావిస్తున్నాం. అమాయకంగా అపోహలు పెంచుకున్న వారిని మేము తప్పుపట్టడం లేదు. దీర్ఘకాలంగా మంచినీటి కొరత ఉన్న రాయచోటి పట్టణానికి త్రాగు నీరు అందించే ప్రాజెక్ట్ రాకరాక వస్తే దానిని ఎవరో అడ్డుకుంటున్నారని ఆందోళన చెందే వారుండడం సహజం. వారికి ఝరికోన ఆందోళనకారుల వైఖరేమిటో వివరించి చెప్పడం అవసరం. అయితే దుర్బుద్ధితో దుష్ప్రచారానికి పాల్పడ్డవారు ఉన్నారు. రాజకీయ వర్గాలలోనే కాక పత్రికా రంగంలోను ఉన్నారు. వారి గురించి, వారి నడవడిక గురించి ఉచిత రీతిలో స్పందించ వలసిన అవసరము ఉందని మేము భావిస్తున్నాం.

బాహుదా నదిమీద 'ఝరికోన' వద్ద ప్రాజెక్ట్ నిర్మించి 10 వేల ఎకరాలకు సాగునీరు కల్పించాలన్న కోరిక, ఆందోళన చాలాకాలంగా ఉంది. ప్రతిపాదన ప్రకారం సుండుపల్లె, సంబేపల్లె, చిత్తూరు జిల్లాలోని కె.వి. పల్లె మండలాల గ్రామాలు ప్రయోజనం పొంది ఉండేవి. గ్రావిటీ ద్వారా పొలాలకు సాగునీరు లభించేది.

వివిధ కారణాల వల్ల అది కార్య రూపం దాల్చలేదు. ఇప్పుడు దాని స్థానంలో దిన్నెమీదపల్లి సమీపంలో ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఎత్తిపోతలకు అనువయిన చెరువు రూపంలో ఉంటుంది. రాయచోటి పట్టణానికి త్రాగునీరు, సుండుపల్లె, సంబేపల్లె, కె.వి. పల్లె మండలాలలో 4900 ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు త్రాగునీరు ఇవ్వడం జరుగుతుంది.

ప్రాజెక్ట్‌లు తొలినాడు ప్రతిపాదించిన రూపంలోనే నిర్మించాలని అనలేము. సాగునీరు బదులు త్రాగునీరు ఇస్తామంటేనూ వద్దనలేము. నీటివాడకములో మొదటి ప్రాధాన్యం, సాగునీటి రెండవ ప్రాధాన్యం, పరిశ్రమల అవసరాలకు మూడవ ప్రాధాన్యం ఇవ్వాలి అనేది అందరూ అంగీకరించే ప్రమాణం.

అయినప్పటికీ సుండుపల్లె మండల ప్రజలు ఆందోళన చేయడానికి సహేతుకమైన కారణం వుంది. ఒక నది మీద కొత్త ప్రాజెక్ట్ నిర్మించే ముందు అప్పటికే ఆ నదినీటిపైన స్థిరపడి ఉన్న హక్కులను లెక్కలోకి తీసుకోవాలి. సాధారణ పరిస్థితులలో ఆ హక్కులకు భంగం కలగించకుండ కొత్త ప్రాజెక్ట్ నిర్మించాలి. ఏవైనా ప్రత్యేక పరిస్థితులలో ఆ హక్కులను కుదించడం సరయినదే అనుకుంటే ఆ విషయంలో ఒక చర్చ, హేతుబద్ధమైన నిర్ణయం ఉండాలి.

బాహుదా నదిమీద ఇప్పుడు కడుతున్న ప్రాజెక్ట్‌కు దిగువలన ఫిల్టర్ల ద్వారా దాదాపు 5000 ఎకరాలు సాగవుతున్నాయి. 7 గ్రామ పంచాయతీలలోని 41 పల్లెలు దీని వల్ల సస్యశ్యామలమయ్యాయి. ఇవి వేరే ఏ నీటి వసతీ లేని గ్రామాలు. రాయచోటి పట్టణంలో సమానంగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాలు. ఈ గ్రామాల నీటి హక్కు గురించి ఆలోచించకుండా ఝరికోన ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టడం న్యాయం కాదు.

**"అట్లగాని ఈ 41 పల్లెల సాగునీటి అవసరాల కోసం ఈ ప్రాజెక్ట్ కట్టనేవద్దని ఆందోళన కారులు అనలేదు. <u>రాయచోటికి త్రాగునీరు ఇవ్వొద్దని అనలేదు.</u> ఈ 41 పల్లెల అవసరాల మాటేమిటి అని మాత్రం అడిగారు, అడుగుతున్నారు. ప్రతిపాదిత ప్రాజెక్ట్ కట్టకు ఫ్లడ్ గేట్లు పెట్టకపోవడం వల్ల రిజర్వాయిర్ పూర్తిగా నిండి పొర్లినప్పుడు మాత్రే నదిలో దిగువన నీళ్ళు ప్రవహిస్తాయి. ఫ్లడ్ గేట్లు పెట్టినట్లయితే క్రింది ప్రాంతపు హక్కులను కొత్తగా ఈ ప్రాజెక్ట్ ద్వారా కల్పించబోయే హక్కులను సమతులంగా కాపాడే అవకాశమయినా వుంటుంది. నిజానికి ఫ్లడ్‌గేట్లు పెట్టినా, కొత్తగా ఝరికోన ప్రాజెక్ట్ ద్వారా తీర్చబోయే అవసరాలకు ఇప్పటికే దిగువున స్థిరపడి ఉన్న అవసరాలకు రెంటికీ సరిపడేంత నీళ్ళు బాహుదానదిలో వున్నాయా అన్న ప్రశ్నకూడా ఆందోళన కారులు అడిగి వుండపచ్చు." అది ప్రభుత్వాన్ని మరింత ఇబ్బంది పెట్టి ఉండేది. కాని ఆందోళన కారులు ఆ ప్రశ్న అడగలేదు. కేవలం ఫ్లడ్ గేట్లు పెట్టండి, క్రిందికి నీళ్లొచ్చే అవకాశాన్ని ఉంచండి.. అని అడుగున్నారు. దీనికే ఇంత కోపం, ఇంత వ్యతిరేకత ఎందుకు ?**

మరొక విషయం కూడ ఆందోళనకారులు అన్నారు. రాయచోటికి త్రాగునీరు ఇచ్చే లక్ష్యాన్ని ఇతర ప్రాజెక్ట్‌లలో కూడ పొందుపరిచారు. వెలిగల్లు, హంద్రీనీవా ప్రాజెక్ట్‌ల లక్ష్యాలను రాయచోటికి త్రాగునీరు ఇచ్చే ప్రస్తావన వుంది. వారి ఒకే లక్ష్యాన్ని రెండు మూడు ప్రాజెక్ట్‌లలో స్థాన ఉన్నప్పుడు వాటిని సమన్వయ పరిచే ప్రయత్నం చేయవలసిన అవసరం లేదా ? ఆ పని చేస్తే ఝరికోన నుండి రాయచోటి మంచినీటి అవసరాలకోసం తక్కువ నీరు తీసుకుంటే సరిపోవచ్చునేమోకదా ? అప్పుడు గ్రామాల సాగునీటి అవసరాలకు బాహుదా నదిలో కొంచెం ఎక్కువ నీరు ఉంటుందేమో కదా ?

ఈ ప్రశ్న అడగడమే తప్పా ? రాయచోటి పట్టణ ప్రయోజనాలను వ్యతిరేకించినట్టా ?

రాయచోటి పట్టణ ప్రజలు ఎంత మంది సుండుపల్లె వాసుల ఆందోళన తమకు వ్యతిరేకం అనుకున్నారో గాని కొందరు పెద్దమనుషులు మాత్రం అనుకున్నారు. ఉద్యమ ప్రయోజనాలను, లక్ష్యాలను వక్రీకరించి దుష్ప్రచారం చేసారు. ఈ దుష్ప్రచారం చేసారు. ఈ దుష్ప్రచారములో పత్రికా రంగంలో ఒక సెక్షన్ సహితం భాగం పంచుకోవడం విచారకరం. పత్రికలు ప్రజా ఉద్యమాల గొంతును పాలకులకు దూరాన ఉన్న ప్రజలకు వినిపిస్తాయని ఆశిస్తాం. లేదా కనీసం తటస్థంగా ఉద్యమం హక్కును, ప్రభుత్వం హక్కును వినిపించి పాఠకులనే నిర్ణయించుకొమ్మన్నా పరవాలేదు. బాహుదా జల సంరక్షణ ఉద్యమానికి పత్రికా రంగం నుండి ఈ సహాయం అందలేదంటే అబద్ధం అవుతుంది. కానీ చాలా నష్టకరమైన దుష్ప్రచారము జరిగింది.

ఝరికోన ఆందోళనకారులు తమ డిమాండ్ల గురించి రాజంపేట పార్లమెంటు సభ్యుడు సాయి ప్రతాప్ గారితో జరిపిన చర్చలను, మద్యం సిండికేట్ల గురించి ఒక మాజీ ఎం.ఎల్.ఏ. అదే నాయకునితో జరిపిన మంతనాలను కలగలిపి ఒకే సారి అందరూ కలసి రెండింటి గురించి రహస్య చర్చలు జరిపారని "ఆంధ్ర జ్యోతి " రాసింది. నదీ జలాల ఆందోళనకు మద్యం సిండికేట్లకు సంబంధం ఏమిటి ? ప్రజా సమస్యలపైన ఆందోళన చేసే వారు తమ డిమాండ్లను ప్రభుత్వ ప్రతినిధులతో రహస్యంగా ఎందుకు చర్చిస్తారు. ఇదేమి తోచన విలేకరి "ఝరికోన, సిండికేట్లపై సాయితో రహస్యంగా చర్చలు" అని వార్త రాసేసారు. దానికి మేమిచ్చిన ఖండనకూడ ప్రచురించారనుకోండి. కానీ బురద అంటుకోవడమెంత సులభమో కడుక్కోవడం అంతే సులభం అనుకుంటే ఎట్లా ?

ఇది అపరిపక్వత వల్ల జరిగిందనుకుంటే, 'వార్త' విలేకరి ఉద్దేశ్య పూర్వకంగానే బాహుదా జల సంరక్షణ ఉద్యమంపైన బురద జల్లాడు. అతను ఉద్దేశ్య పూర్వకంగానే ఈ పని చేసాడని మేము పూర్తి బాధ్యతతో అంటున్నాం. ఆ పని చేసిన రాయచోటి వార్త విలేకరికి పత్రికా రంగంలో ఎంత అనుభవం ఉందో మాకు తెలీదు. ఈ వృత్తిలో ఇంకెంత కాలం కొనసాగుతాడో తెలీదు. మానవ హక్కుల ఉద్యమానికి పత్రికా రంగంతో ఉండే అనుబంధంతో, అనుభవంతో పోలిస్తే ఎవరి అనుభవమైనా తక్కువే. అందువల్ల రాజకీయాలు చేయదలచుకుంటే రాజకీయాలలోకి పోవడం ఉచితంగా ఉంటుంది తప్ప పత్రికా రంగాన్ని అడ్డంపెట్టుకోవద్దని అతనికి నిర్మొహమాటంగా చెప్పదలచుకొన్నాం.

అతను ఏప్రిల్ 5 వ తేదీన ప్రచురించిన వార్త సారాంశం ఇది: ఝరికోన ప్రాజెక్ట్ కాంట్రాక్టు తీసుకొన్న రాంకీ కంపెనీ వారు (ఈ వార్తలో, ఈ కంపెనీకి మాత్రమే పేరుంది. మనుషు నెవ్వరనేది లేదు.) దానిని ఒక పేరులేని సబ్ కాంట్రాక్టర్‌కూ, అతను మళ్లీ మరొక పేరులేని దానిని సబ్ కాంట్రాక్టర్‌కూ అప్పగించగా, సంబేపల్లికి, రాయచోటికి చెందిన ముగ్గురు పేరులేని వ్యక్తులకది గిట్టక ఆ చివరిపేరు లేని సబ్ కాంట్రాక్టర్‌ను లక్షల్లో లంచం అడిగారంట అది దక్కక పోవడం వల్ల ప్రాజెక్ట్‌కు అడ్డం పడదలచుకున్నారంట. అప్పటిదాకా అమాయకంగా జరుగుతున్న బాహుదా జల సంరక్షణ ఆద్యమం ఆ తరువాత ఈ మామూలు రాయుళ్ళ చేతిలోకి పోయిందట. ఆ తరువాత ప్రభుత్వంతో చర్చలు, నాయకులతో సంప్రదింపులు అన్నీ వారివేనంట. ఎం.పి. సాయి ప్రతాప్ గారితో వాళ్ళు ఏ రకమైన పరిష్కారం చర్చించారో వారికే తప్ప సుండుపల్లె వాసులకు తెలియదంట. బ్లాక్ మెయిలర్స్ చెప్పిందే వేదమంట.

బాహుదా జల సంరక్షణ ఉద్యమానికి కన్వీనర్ మా సంస్థ సభ్యుడు కాబట్టి ఉద్యమం ఎవరి చేతుల్లోకో పోయిందంటూ ఇతను రాసింది పచ్చి అబద్ధం, తెలిసి రాసిన అబద్ధం అని చెప్తున్నాం. మార్చి – ఏప్రిల్ నెలల దినపత్రికలు చదివిన వాళ్ళకు బాహుదా జల సంరక్షణ ఆందోళనలో ఎంతమంది పాల్గొన్నారో తెలిసే వుంటుంది. అన్ని రాజకీయ పక్షాల స్థానిక నాయకులు, అందరు ప్రజా ప్రతినిధులు, అన్ని రకాల ప్రజా సంఘాలు పాల్గొనడం జరిగింది. చివరిదాకా ఈ ప్రజలందరి ఎరుకతోనే అన్ని నిర్ణయాలు జరిగియి.

ఇంతకూ నువ్వు రాసిన వార్తకు ఆధారం ఏమిటని ఆ విలేకరిని అడిగితే రాయచోటి ప్రజలు అనే పేరుతో కొందరు ముఖ్యమంత్రికి రాసిన లేఖను చూపించారు. విచిత్రమేమిటంటే ఆయన దగ్గరున్నది ఆ ప్రజలు సంతకం చేసిన ఉత్తరమే, దాని పోటోస్టాట్ నకలు కాదు. ఇంకా విచిత్రమేమిటంటే ఆ ఉత్తరాన్ని రాసిన వాళ్ళు ఈ ఒక్క విలేకరికి తప్ప వేరే ఏ విలేకరికీ దాన్ని చూపించలేదు, దాని గురించి చెప్పలేదు, దాని నకలు ఇవ్వలేదు. అసలు ఆయన 5వ తేదీన ప్రచురించిన వార్తలో ఉత్తరం ప్రస్తావనే లేదు. 7వ తేదీన ఒక 'వార్త' లో మాత్రమే ఆ ఉత్తరాన్ని గురించి వార్త వచ్చినది. ఆ ఉత్తరము నకిలీ అని వేరే చెప్పనవసరము లేదు. 5వ తేదీన ఉద్యమం బ్లాక్ మెయిలర్ల చేతిలోకి పోయిందని రాసిన వార్త పొరబాటునో, ఏమరపాటునో రాసి వున్నట్లయితే దానికి సపోర్టుగా ఈ విలేకరి ఒక నకిలీ ఉత్తరాన్ని తయారు చేసుకొనే వాడు కాదు. నకిలీ ఉత్తరము తయారుచేసి పెట్టుకున్నాడంటే అదంతా కావాలనే చేసిందని అర్థం అవుతుంది. ఒక వ్యక్తి పట్ల మొహమాటంతో పత్రికా రంగాన్ని దిగాజార్చే ఈ ప్రవర్తనను మేము ఉపేక్షించదలచుకోలేదు.

ఇదంతా ఇప్పుడెందుకు? అంటారేమో. ఝరికోన ప్రాజెక్ట్ నమూనా మార్పుకోసం బాహుదా జలసంరక్షణ ఉద్యమం ముగియలేదు. యం.పి. సాయి ప్రతాప్ గారిచ్చిన హామీ అమలు కాలేదు. కనీసం ఫ్లడ్ గేట్ల ప్రతిపాదన కూడా ప్రభుత్వానికి చేరలేదు. కాబట్టి ఆందోళన మళ్లీ ప్రారంభించే పరిస్థితి వున్నది.

ఈ సారైనా అపోహలు, అబద్దాలు పక్కనబెట్టి సహృదయంగా ఈ ఆందోళనను ఈ ప్రాంత వాసులు స్వీకరిస్తారని ఆశిస్తూ ...

**మానవ హక్కుల వేదిక ,**

(హెచ్. ఆర్.యఫ్)

కడప జిల్లా కమిటి.

10 జూన్ 2006